ప్రజాశక్తి
మంగళవారం 27 జూన్ 2023



ఎస్‌కెయులో 28 నుంచి అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి-అనంతపురం

ఎస్‌కెయు గణిత శాస్త్ర విభాగంలో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు "ఇన్నోవేషన్స్ అండ్ డెవలెప్‌మెంట్స్ ఇన్ మ్యాథమెటికల్ సైన్స్ అండ్ టెక్నాలజీ" అనే అంశంపై అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నట్లు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి రామకృష్ణ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపి ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.హేమచంద్రారెడ్డి, యూపీఎస్సీ, మాజీ సభ్యులు వై.వెంకటరామిరెడ్డిలు ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొంటారన్నారు. ఇండియన్ ఇన్సిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ తిరుపతికి చెందిన ఆచార్య డిఎస్.నాగరాజు ముఖ్య ఉపన్యాసకులుగా వస్తున్నారన్నారు. మూడు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సులో వివిధ దేశాల నుంచి వక్తలు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. జర్మనీ, మలేషియా, ఫిజీ, అమెరికా దేశాల నుంచి వర్చువల్ విధానంలోనూ పాల్గొంటారన్నారు. వీరితోపాటు జాతీయస్థాయిలో వక్తలు హాజరవుతారని తెలిపారు.



జగన్న సురక్ష సేవలపై ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజలందరికీ జగనన్న సురక్ష సేవలు

ఇంటింటికీ వెళ్లి వాటి గురించి తెలియజేయాలి

కలెక్టర్ పి.అరుణ్ బాబు

ప్రజాశక్తి-కొత్తచెరువు

జగనన్న సురక్ష ద్వారా అమలు చేస్తున్న సేవలను ప్రజలందరికీ అందేలా చూడాలనిన టీమ్ మెంబర్లకు కలెక్టర్ పి.అరుణ్ బాబు సూచించారు. సోమవారం నాడు కొత్తచెరువులోని 1,2 సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకునే బృందాల పనితీరును కలెక్టర్ పరిలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లినప్పుడు వారితో స్నేహభావంతో మాట్లాడాలన్నారు. ప్రభుత్వం ఉచతంగా అందించే 11 రకాల సేవలను ఇంటింటా తెలియజేయాలని సూచించారు. గ్రామంలో క్యాంప్ జరిగే ఆ తేదీనీ ముందుగానే అందరికీ తెలియజేయాలన్నారు. అర్హులై ఉండి ఏదైనా పథకం అందక పోతే వారిని గుర్తించి క్యాంపులకు తీసుకొచ్చే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భాగ్యరేఖ, తహశీల్దార్ రామాంజనేయులు, నోడల్ అధికారి శివారెడ్డి, ఎంపీడీవో సిద్ధారెడ్డి, వాలంటీర్లు, పాల్గొన్నారు.



తమ్ముళ్ల కొట్లాట..!

- భవిష్యత్తు కోసం ఆరాటం
- బస్సుయాత్రలో నేతల మధ్య ఆధిపత్య పోరు
- టిడిపిలో కొనసాగుతున్న గ్రూపు తగాదాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రజల భవిష్యత్తుకు టిడిపి పేరుతో బస్సు యాత్ర చేపట్టిన తెలుగుదేశం పార్టీకి కొత్త తలనొప్పులు వచ్చిపడుతున్నాయి. ప్రజల్లోకి వెళ్లేందుకు చేపట్టిన ఈ యాత్ర గ్రూపు తగాదాలకు కేంద్రంగా మారుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నేతల భవిష్యత్తుకు ఆరాటంలాగా మారి ఆధిపత్యపు యాత్రగా సాగుతోంది. ఆ పార్టీ నేతల మధ్యనున్న విభేదాలు ప్రతి చోటా బయట పడుతూ వస్తున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో ఈ యాత్రను సైతం రద్దు చేసుకునే పరిస్థితి నెలకొంది. ఈనెల 23వ తేదీన కదిరిలో బస్సుయాత్ర అట్టహాసంగా ప్రారంభమైంది. అక్కడ మాజీ ఎమ్మెల్యే చాంద్‌బాషాకు పిలుపు లేకపోవడంతో ఆయన ఈ యాత్రకు దూరంగా ఉన్నారు. ఇక పుట్టపర్తిలో సాధారణంగానే జరిగినప్పటికీ పెనుకొండకు వచ్చే సరికి నేతల మధ్య విభేదాలు తారా స్థాయికి చేరాయి. నేతలు గ్రూపులుగా విడిపోయి బాహాబాహికి దిగారు. సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులుగా బికె.పార్థసారధి, మరో నాయకురాలు సబితమ్మ మధ్య గ్రూపు విభేదాలున్నాయి. ఈ గ్రూపులకు నాయకుల ఫ్లెక్సీలుండటం కూడా తగాదాకు కారణమైంది. బస్సుయాత్ర సందర్భంగా ఒకరినొకరు బాహాటంగానే కొట్టుకున్నారు. జిల్లా అధ్యక్షుడి నియోజక వర్గంలోనే ఇది జరగడం గమనార్హం. ఇక కళ్యాణదుర్గం నియోజకవర్గంలో మంగళవారం యాత్ర జరుగనున్న నేపథ్యంలో ఇప్పటికే ఉత్కంఠత నెలకొంది. అక్కడ ముందు నుంచి మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి కుమారుడు మారుతీ చౌదరి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉమామహేశ్వర నాయుడు రెండు గ్రూపుల మధ్య విభేదాలున్నాయి. ఈ గ్రూపుల మధ్య అనేక మార్లు బాహాటంగానే ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలోనే మంగళవారం జరిగే బస్సు యాత్రలోనూ రెండు గ్రూపుల నాయకులు బల ప్రదర్శనలకు దిగి తమ పట్టును చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ బల ప్రదర్శనలో ఏమి జరుగుతుందన్న ఉత్కంఠత ఆ పార్టీ శ్రేణుల్లో నెలకొంది. ఇటువంటి విభేదాలు మరికొన్ని నియోజకవర్గాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. మడకశిరలోనూ మాజీ ఎమ్మెల్యే ఈరన్న, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామిల మధ్య విభేదాలున్నాయి. ఈ క్రమంలో ఇక్కడ యాత్రనే లేకుండా చేశారు. ఇక హిందూపురంలోనూ యాత్ర లేదు. ఆ తరువాత అత్యధికంగా విభేదాలున్న ప్రాంతాల్లో శింగనమల కూడా ఉంది. ఇక్కడ నియోజకవర్గ ఇన్‌ఛార్జి లేకుండా టూమెన్ కమిటీ పేరుతోనే నడుస్తోంది. ఈ టూమెన్, ఇన్‌ఛార్జీ బండారు శ్రావణి గ్రూపుల మధ్య ఏమి జరుగుతందో నన్నది కార్యకర్తల్లో ఉంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీకి తీరని నష్టం చేకూరింది. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పార్టీకి ఘోర పరాజయమైంది. ఇంత జరిగినా పార్టీ నేతల్లో కనువిప్పు కలుగలేదు. నాయకుల మధ్య సమన్వయం ఇప్పటికీ కుదరలేదు. ఎవరికీ వారుగా నేతలు ఆధిపత్యం కోసం ఆరాటపడుతూనే ఉన్నారు. నేతల మధ్య తగదాల ప్రభావం క్షేత్ర స్థాయిలో కార్యకర్తలను, ద్వితీయ శ్రేణి నాయకులను సైతం గందరగోళంలో పడేస్తోంది. ఇదే పరిస్థితి వచ్చే ఎన్నికల్లోనూ కొనసాగితే అధికార వైసిపిని తట్టుకుని నిలబడటం ఎంత వరకు సాధ్యమవుతుందన్న మీమాంస పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. ఈ బస్సుయాత్ర ముందు కెళుతున్న కొద్ది మరిన్ని విభేదాలు పార్టీలో నెలకొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

వంతెనల నిర్మాణంలో నిర్లక్ష్యం

జాతీయ రహదారుల అభివృద్ధి పేరుతో కదిరి సమీప ప్రాంతాల్లో ఇటీవల పలు అభివృద్ధి పనులను చేపట్టారు. అయితే ఈ పనులు నత్తనడకన సాగుతుండడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రహదారులకు అనుసంధానంగా చేపట్టిన వంతెనల నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతండడంతో రోడ్డు పనులు ఆలస్యం అవుతున్నాయి. మదనపల్లి-తిరుపతి, కదిరి-రాయచోటి ప్రధాన రహదారుల మార్గాల్లో రోడ్డు విస్తరణలో భాగంగా వంతెన నిర్మాణ పనులను చేపట్టారు. ఇవి మొదలై కొన్ని నెలలు కావస్తున్నా ఈ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. నిర్మాణ పనులు ఆలస్యం కావడంతో ఆ రహదారుల్లో ప్రయాణం చేసేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే చాలా మంది నిర్మాణం జరుగుతున్న వంతెనల వద్ద ప్రమాదాలకు గురయ్యారు.

రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

అసంపూర్తి పనుల వద్ద ప్రమాదాలు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

కదిరి పట్టణంలోని నానాదర్గా సమీపంలో వంతెన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ ప్రాంతం సమీపంలో నివసించే కాలనీవాసులు నెలల తరబడి దుమ్మూధూళితో జీవనం సాగిస్తున్నారు. మూడు రోజుల క్రితం కురిసిన వర్షానికి వంతెనపై వేసిన ఎర్రమట్టి కుంగిపోయింది. దీంతో అక్కడ పెద్ద గుంత ఏర్పడింది. కొత్త వారు ఎవరైనా ఈ దారిపై చూసుకోకుండా వెళ్తే ఆ గుంతలో పడే ప్రమాదం ఉంది. జాతీయ రహదారి ఈ వంతెన మార్గానే ఉండడంతో నిత్యం వందలాది వాహనాలు దీనిపై రాకపోకలు సాగిస్తున్నాయి. తరచూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమీక్షా సమావేశాలు నిర్వహించి పనులను వేగవంతం చేయాలని ఆదేశాలు ఇవ్వడం తప్పా ఆచరణలో జరుగుతున్న పనులు మాత్రం నామమాత్రంగానే ఉన్నాయి. కదిరి-రాయచోటి ప్రధాన రహదారిలో ఇరువైపులా రెండు వరుసల రహదారి పూర్తి చేయాలని ఉద్దేశంతో చేపట్టిన పనులూ నత్తనడకనే సాగుతున్నాయి. సాధారణంగా రెండువరుసల రహదారి పనులు జరిగేప్పుడు ఒకపక్క పూర్తి చేసి, మరోపక్క కంకర వేసి పనులు చేయాల్సి ఉంది. ఇక్కడ మాత్రం ఇరువైపులా గుంతలు తవ్వి వాటిలో కంకర వేసి వదిలేశారు. దాదాపు 6 నెలలు కావస్తున్నా నేటికీ ఈ పనులు పూర్తికాని పరిస్థితి నెలకొంది. ఈపనులను దక్కించుకున్న గుత్తేదారులు వీటిని చేస్తున్నారా.. లేక వదిలేశారా.. అన్న విషయం కూడా స్థానికులకు అర్థం కాని పరిస్థితి ఉంది. ఈ పనులు పూర్తికాకపోవడంతో ప్రధాన రహదారి మీదుగా రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలకు ఇంతటి అవసరం ఉన్న రహదారుల నిర్మాణ పనులపై పాలకులు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి కదిరి ప్రాంతంలో వంతెనల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి రాకపోకలకు పూర్తి స్థాయిలో రోడ్డును అందుబాటులోకి తేవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



మదనపల్లి-తిరుపతి రహదారి వద్ద గుంత పడి ప్రమాదకరంగా ఉన్న వంతెన ప్రాంతం



రక్షణ గోడ లేకుండా ప్రమాదకరంగా ఉన్న వంతెనపై నుంచి వెళ్తున్న భారీ లారీ


ఇబ్బందులు పడుతున్నాం..

రోడ్డు నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో స్థానికంగా ఉన్న తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఫిబ్రవరి నెలలో పనులను ప్రారంభించారు. ఐదు నెలలు కావస్తున్నా పనుల్లో పురోగతి లేదు. ఈ పనులను వేగవంతం చేయడంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. శుక్రవారం నాడు కురిసిన వర్షానికి వంతెనపైన వేసిన మట్టి కుంగిపోయి వాహనాలు కిందకు వాలిపోతున్నాయి. ఈ వాహనాలు ఎక్కడ జనం మీదపడుతాయో అన్న భయం వెంటాడుతోంది. ప్రజాప్రతినిధులు స్పందించి సత్వరమే వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాలి.

హైదర్ ఆలీ, ఇమ్రాన్, స్థానికులు

'జగనన్న సురక్ష'పై జెసి పర్యవేక్షణ

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్



'జగనన్న సురక్ష'పై అధికారులతో మాట్లాడుతున్న జెసి చేతన్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ చేతన్ మండలంలో పర్యటించారు. ఇందులో భాగంగా వానవోలు, గుంటుపల్లితండా పంచాయతీల్లోని గ్రామాల్లో అధికారులను కలిసి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే 'జగనన్న సురక్ష' ద్వారా అందించే సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. జెసి వెంట తహశీల్దార్ రంగనాయకులు, ఎంపిడిఒ రఘునాథ్‌గుప్తా, సర్పంచి గంగులప్ప, ఉప సర్పంచి బుల్లెట్ బాబు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ఉన్నారు. అలాగే మండల పరిధిలోని మందలపల్లి, కరావులపల్లి తండా పంచాయతీల్లోని మందలపల్లి-1 పుట్టగుండ్లపల్లి, గడ్డంతండా పంచాయతీలోని మందలపల్లి-2 సచివాలయల్లో మండల సచివా లయ కన్వీనర్ కసిరెడ్డి నరసింహా రెడ్డి, ఎంఎల్ఒ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో 'జగనన్న సురక్ష'పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి పాలే జయరాంనాయక్, సర్పంచిలు ప్రమీల ముసలిరెడ్డి, రమాదేవి, రంగనాయక్, బి.నర్సిరెడ్డి, వాసుదేవనాయక్, ఎంపిటిసిలు నాగేనాయక్, పి.ఓబుల్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

రొద్దం : ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్ మండల పరిధిలోని రెడ్డిపల్లి పంచాయతీలో సర్పంచి రామాంజనేయు లుతో కలిసి పర్యటించి 'జగనన్న సురక్ష'పై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే వారు ప్రజల వద్దకు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు.

రొద్దంలో పడకేసిన పారిశుధ్యం

ప్రజాశక్తి-రొద్దం



ఎంపిడిఒ కార్యాలయం వద్ద పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

రొద్దంలో పారిశుధ్యం పడకేసిందన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాలు, మీ సేవా, సచివాలయ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి నా పట్టించుకునే వారే కరువయ్యారు. నిత్యం మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సంచరించే ప్రభుత్వ కార్యాలయాల వద్దే పరిస్థితి ఇలాగ ఉంటే ఇక గ్రామాలు, రహదారులు, వీధుల్లో పరిస్థితి ఏంటని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ప్రజల ఆరోగ్యాలకు హాని కలుగకుండా పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాప్తాడు నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం


అవినీతి, అక్రమాలకు కేరాఫ్ 'తోపుదుర్తి' కుటుంబం : బస్సు యాత్రలో పరిటాల సునీత

ప్రజాశక్తి-కనగానపల్లి

నాలుగేళ్ల వైసిపి పాలనలో రాప్తాడు నియోజకవర్గంలో మట్టి మాఫియా.. భూ మాఫియా.. వసూళ్ల మాఫియా.. తప్ప సాధించిందే మీ లేదని మాజీ మంత్రి పరిటాల సునీత, ఉమ్మడి అనంతపురం జిల్లా టిడిపి నాయకులు విరుచుకు పడ్డారు. 'భవిష్యత్తుకు గ్యారెంటీ' పేరుతో టిడిపి చేపట్టిన బస్సు యాత్ర సోమవారం రాప్తాడు నియోజకవర్గంలో అశేష జనవాహిని మధ్య సాగింది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ టిడిపి హయాంలో చేసిన అభివృద్ధిని వివరించారు. రాప్తాడు సమీపంలోని జాకీ పరిశ్రమ వద్ద ప్రారంభమైన బస్సు యాత్ర పలు గ్రామాల మీదుగా పేరూరుకు చేరుకుంది. ముందుగా జాకీ పరిశ్రమ వద్ద సెల్ఫీ ఛాలెంజ్‌తో ప్రభు త్వానికి సవాల్ విసిరారు. టిడిపి హయాంలో తీసుకొచ్చిన భారీ పరిశ్రమను ఎమ్మెల్యే తోపుదుర్తి సోదరులు స్వార్ధ ప్రయోజనాల కోసం తరిమేసి ఇక్కడి ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గొందిరెడ్డి పల్లిలో ఎర్రమట్టి మాఫియా గురించి మరోసారి బయట ప్రపంచానికి తెలిసే విధంగా టిడిపి నాయకులు సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. రిజర్వాయర్ల పేరుతో రైతులను మోసం చేసిన తీరుపై సూటిగా ప్రశ్నించారు. ఎమ్మెల్యే మాటలు కోటలు దాటుతాయని చేతలు మాత్రం గడప దాటవన్నారు. బస్సుయాత్రలో పరిటాల శ్రీరామ్‌తో పాటు జిల్లా ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



గొందిరెడ్డి పల్లిలో ఎర్రమట్టి తవ్వకాలను పరిశీలిస్తున్న పరిటాల సునీత, శ్రీరామ్, టిడిపి నాయకులు



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

సంక్షేమ పథకాలతోనే రాష్ట్రాభివృద్ధి

ఎమ్మెల్యే తిప్పేస్వామి

ప్రజాశక్తి-అమరాపురం

ప్రజా సంక్షేమ పథకాలతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. మండల పరిధిలోని కె.శివరం సచివాలయ పరిధిలో సోమవారం సర్పంచి చిత్తన్నయాదవ్ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేతో పాటు ఎంపిపి ఈరన్న, వైస్ ఎంపిపి లలితమ్మ, కృష్ణమూర్తి, జడ్పిటిసి సారక్క నరసింహమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పథకాల అమలు సీఎం జగన్‌కే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ ముని స్వామి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ నళిని రంగేగౌడ్, డైరెక్టర్ వీరక్యాతప్ప గగన తనువీర్ గౌడ్, వైసిపి ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు

లేపాక్షి ఆలయాన్ని సందర్శించిన ప్రముఖులు

లేపాక్షి : స్థానిక దుర్గావీరభద్ర పాపానేశ్వరస్వామి ఆలయాన్ని సోమవారం ఎపిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు సందర్శించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు ఆలయ విశిష్టతను తెలియజేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట ఎఐసిసి కార్యదర్శి మయప్పన్, ఎపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, కోఆర్డినేషన్ సభ్యులు రామ్మూర్తి, జిల్లా అధ్యక్షుడు సుధాకర్, కేటి శ్రీధర్, ఎస్‌సి సెల్ అధ్యక్షుడు సాకే శంకర్, ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు నాగమధు యాదవ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామారావు, కోటా సత్యం, రామాంజి ఉన్నారు. అలాగే కేంద్ర జలశక్తి అభియాన్ బృందం సభ్యులు రాజేంద్ర కుమార్, శాస్త్రవేత్త రాఖీ, శివప్రసాద్ ఆలయాన్ని సందర్శించగా అర్చకులు వారికి ఆలయ విశిష్టతను తెలియజేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకు ముందు వారు మండలంలో ఉపాధి పనులను పరిశీలించారు. అందులో భాగంగా వివిధ పాఠశాల ల్లో ఏర్పాటు చేసిన అవెన్యూ ప్లాంటేషన్లను పరిశీలిం చారు. మహాత్మా జ్యోతి బాపూలే పాఠశాలలో మొక్క లు నాటారు. వారి వెంట ఎంపిడిఒ నరసింహనా యుడు, పిడి రామాంజనేయులు, ఎపిఒ జ్యోతి పాల్గొన్నారు

కాటికాపరులకు గుర్తింపు కార్డులు ఇవ్వండి

లేపాక్షి : కాటి కాపరులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరుతూ సోమవారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కెవిపిఎస్) ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా, మండల కార్యదర్శులు రమణ, మంజునాథ్ మాట్లాడుతూ కాటికాపరులు తరతరాల నుంచి శ్మశానాల్లో గుంతలు తవ్వుతూ దుర్భర జీవనం గడుపుతున్నార న్నారు. కావున ప్రభుత్వం వారికి గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు నాల్గో తరగతి ఉద్యోగులుగా పరిగణించి ఇల్లు నిర్మించి, వారి పిల్లల చదువు ఖర్చులు భరించా లని డిమాండ్ చేశారు. అలాగే గ్రామాల్లో వివిధ రూపాల్లో ఉన్న కుల వివక్షను రూపుమాపడానికి గ్రామాల్లో పౌర హక్కుల దినం పాటించాలని కోరారు. ధర్నాలో కాటికాపరుల సంఘం అధ్యక్షులు ఆదినారాయణప్ప, ప్రధాన కార్యదర్శి మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

స్థలాలు చూపకపోతే ఉద్యమిస్తాం

పెనుకొండ :అర్జీదారులకు ఇళ్ల స్థలాలు చూపాలని, లేనిచో 15 రోజుల తర్వాత గుడిసెలు వేసి ఉద్యమిస్తామని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు హెచ్చరిం చారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాల యం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ అధ్యక్షతన ఇల్లు లేని నిరుపేదలతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ పేదలు అర్జీలు ఇచ్చి నెల రోజులవుతున్నా అధికారుల్లో చలనం లేదన్నారు. 15 రోజుల్లోపు స్థలాలు చూపకపోతే పేదలతో కలిసి గుడిసెలు వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా కమిటీ సభ్యులు వెంకట్రాముడు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తిప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-మడకశిర

మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహశీల్దార్‌కు వినతి పత్రం అంద జేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు ఉమేష్ నాయక్ మాట్లాడుతూ మడకశిర నియోజక వర్గంలో నాడు-నేడు ద్వారా చేపట్టిన పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అందించాలని కోరారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిం చారు. కార్యక్రమంలో శశికుమార్, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన

గోరంట్ల : మండల పరిధిలోని సింగిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం కేంద్ర జల శక్తి అభియాన్ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా సెంట్రల్ నోడల్ ఆఫీసర్ రాజేంద్ర కుమార్ ఫారం పాండ్ పనులను పరిశీలించారు. అలాగే రైతులతో ముఖాముఖి మాట్లాడి ఉపాధి హామీ చట్టం ద్వారా చేపట్టిన పనులు రైతులకు ఏవిధంగా ఉపయోగపడ్డాయి అనే విషయాలపై అడిగి తెలుసుకున్నారు. బృందం వెంట శాస్త్రవేత్త రాఖీ, జాయింట్ కమిషనర్ శివ ప్రసాద్, సంచాలకులు శివానంద నాయక్, పిడి రామాంజనేయులు, వరప్రసాద్, జేఈ మోహన్‌బాబు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

తనకల్లు : ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో నరసింహులు, ఇఒఆర్‌డి ఆనందయ్య, ఎంపీపీ వైవి. కౌసల్య, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు మండల పరిధిలోని కొక్కంటి గ్రామంలో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి, అధికారులు వెళ్లి వారికికావాల్సిన సుమారు 11 ధ్రువపత్రాలను అక్కడికక్కడే మంజూరు చేస్తారని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

'మధ్యాహ్నభోజనం' తనిఖీ

బత్తలపల్లి : మండలంలోని గరిశలపల్లి ,ఉప్పర్లపల్లి పాఠశాలల్లో మధ్యాహ్నభోజన పథకం అమలు తీరును ఎంఇఒ 2 సుధాకర్‌నాయక్ సోమవారం తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో జరుగుతున్న నాడునేడు పనులను పరిశీలించారు. గరిశలపల్లిలో ఆదివారం పాముకాటులో మృతిచెందిన 1 వ తరగతి విద్యార్థి యశ్వంత్ కుటుంబాన్ని ఈసందర్భంగా పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం నాగేశ్వరయ్య, సిఆర్‌పి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు ధర్మవరం విద్యార్థిని

ధర్మవరం టౌన్ : జాతీయ స్థాయి హాకీ పోటీలకు స్థానిక కెహెచ్ ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థిని శ్రావణి ఎంపికైనట్టు ఆ కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రావణిని ప్రిన్సిపల్‌తో పాటు వైస్ ప్రిన్సిపల్ జీవన్ కుమార్, పీడీ ఆనంద్, అధ్యాపకులు చిట్టెమ్మ, షమీవుల్లా, కిరణ్‌కుమార్, గోపాల్‌నాయక్, పావని, భువనేశ్వరి, పుష్పవతి, గౌతమి, స్వామి తదితరులు అభినందించారు.

నేడు టిడిపి ఆధ్వర్యంలో ధర్నా

తనకల్లు : బాలసముద్రం పంచాయతీ. బాలసముద్రం రైల్వే బ్రిడ్జి గోవింద వారి పల్లి రైల్వే బ్రిడ్జి సమస్యల పరిష్కారానికి టిడిపి ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహిస్తున్నట్లు స్థానిన నాయకులు తెలిపారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జికందికుంట వెంకటప్రసాద్ సూచన మేరకు కొక్కంటి క్రాస్‌లో పార్టీ మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఆందోళనకు ఆయా గ్రామాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని టిడిపి బిసిసెల్ జిల్లా ఉపాధ్యక్షులు సోంపాల్యం నాగభూషణం కోరారు.

'టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి'

బుక్కపట్నం : తెలుగుదేశం పార్టీ తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టిడిపి ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టో గోడపత్రికలను నాయకులు విడుదల చేశారు. అనంతరం సామకోటి ఆదినారాయణ మాట్లాడుతూ టిడిపి మినీ మేనిఫెస్టోలో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందుతారన్నారు. టిడిపి మేనిఫెస్టోను ఇంటింటా ప్రచారం చేసి రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తీసుకువస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నారాయణస్వామి, శ్రీరాములు, సామకోటి ఈశ్వరయ్య, రామాంజనేయులు , తెలుగు యువత ఉపాధ్యక్షులు సుధీర్, కుమార్, నరేష్, కుబీర్, తదితరులు పాల్గొన్నారు.

మానవసేవ ఎంతో విలువైనది...

ధర్మవరం టౌన్ : ప్రతి ఒక్కరూ మానవ సేవను ఆచరించి అందులో ఉన్న సంతృప్తినిపొందాలని పుట్టపర్తి శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు రత్నాకర్ పేర్కొన్నారు. సోమవారం ధర్మవరంలోని పుట్టపర్తి రోడ్డు శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా షిరిడి సాయిబాబా దేవాలయ అధ్యక్షులు సూర్యప్రకాష్, కోశాధికారి హేమంత్ కుమార్, సూర్యనారాయణ, రామలింగయ్య, టిసి. నారాయణరెడ్డి తదితర కమిటీ సభ్యులు రత్నాకర్‌కు ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహారాష్ట్ర రాష్ట్రం–పూనే నుంచి వచ్చిన రెండు వేల మంది బాబా భక్తులతో కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక షిరిడి సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తాదులు పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రతకు ప్రజల సహకారం

ధర్మవరం టౌన్ : పట్టణ పరిశుభ్రతకు ప్రజల సహకారం అవసరమని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం తెల్లవారుజామున పట్టణంలోని శానిటరీ విభాగాన్ని ఆయన తనిఖీ చేశారు. వార్డులలో, ప్రధాన కూడలిలో వారు పర్యటించారు. ఎన్టీఆర్ సర్కిల్లో గల గ్రిల్లులు, డ్రైనేజీ, ఇతర కాలువలను వారు పరిశీలించారు. రోడ్లపైన, కాలువల పైన, ఎవరైనా చెత్త వేస్తే జరిమానా తో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వార్డులలోని ప్రజలు, ప్రధాన కూడలిలోని వ్యాపారస్తులు చెత్తను తొలగించే మార్గదర్శకాలను పాటిస్తే పట్టణ పరిశుభ్రతకు దోహద పడినవారు అవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ కార్యదర్శులు శివ, అశోక్, మేస్త్రి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణమండప నిర్మాణానికి సహకరించండి

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి మండల పరిధిలోని జగరాజు పల్లి సమీపంలో కొండ ఉన్న ఓబులేశ్వర స్వామి కళ్యాణ మండప నిర్మాణానికి దాతలు సహకరించాలని ఓబులేశ్వర స్వామి సేవా సమితి సభ్యులు కోరారు. కళ్యాణ మండప నిర్మాణాన్ని చేపట్టామని మండప నిర్మాణానికి దాదాపు రూ. 40 లక్షలు వ్యయం కానున్నదని చెపాపరు. ఇప్పటికే పలువురు దాతలు ఇచ్చిన విరాళాలతో పనులు చేపట్టామని నిర్మాణానికి దాతలు భక్తులు సహకరించాలని కోరారు.

ఆశ్రమానికి నీటిట్యాంక్ వితరణ

ధర్మవరం టౌన్ : పట్టణ సమీపంలోని చిగిచెర్ల రోడ్డులోగల కాశిరెడ్డినాయన ఆశ్రమానికి యువర్స్ పౌండేషన్ ఆధ్వర్యంలో నీటి ట్యాంకును సోమవారం వితరణ చేశారు. యువర్స్ పౌండేషన్ సభ్యుడు వీఆర్సీ గుప్తా భార్య సుజాతమ్మ జ్ఞాపకార్థం నీటి ట్యాంకు అందజేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షులు వైకే శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువర్సే ఫౌండేషన్ కార్యదర్శి సుంకు సుకుమార్, కోశాధికారి రాధాకృష్ణ, డాక్టర్ సుబ్బారావు, ఓవీ ప్రసాద్, జయంతి వినోద్, ఆశ్రమసభ్యులు పాల్గొన్నారు.

పచ్చదనం వృద్ధితోనే మానవాళి మనుగడ

నల్లమాడ : పచ్చదనం వృద్ధితోనే మానవాళి మనుగడ సాధ్యమని జలశక్తి అభియాన్ కేంద్రబృందం సభ్యులు సూచించారు. మండల పరిధిలోని పలు గ్రామాలలో సాగుతున్న ఉపాధి హామీ పథకం పనులను వారు సోమవారం పరిశీలించారు. రెడ్డిపల్లి, నల్లమాడ, కురుమాల, గంగాపురం, దొన్ని కోట, బాసం వారి పల్లి, తదితర గ్రామాలలో సాగుతున్న మామిడి, గులాబి, తోటల పెంపకం, సరిహద్దు కందకాలు తదితర పనులను పరిశీలించారు. ఈ పనుల ద్వారా వనగూరే ప్రయోజనాల గూర్చి సంబంధిత రైతులకు వివరించారు. పండ్ల జాతి మొక్కలు, ఇతరత్రా పచ్చదనాన్ని పెంపొందించే చెట్ల పెంపకం ద్వారా ప్రయోజనాల గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో బృందసభ్యులు నోడల్ అధికారి రాజేంద్ర కుమార్ నేగి, శాస్త్రవేత్త రాఖి, ద్వామా పీడీ రామాంజనేయులు, ఎంపీడీవో కొండన్న, ఎపిడి శ్రీనివాసరెడ్డి, ఎపిఒ ఆకుల సూర్యనారాయణ, రైతులు ఆదినారాయణ, అఖిల, రవీంద్ర, తదితరులతో పాటు ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యవృత్తి ప్రత్యేకమైనది...

హిందూపురం : అన్ని వృత్తుల్లో కెల్లా వైద్యవృత్తి ప్రత్యేకమైనదని ఉన్నతమైన సేవలను అందించి మంచి పేరు తెచ్చుకోవాలని జిల్లా అసుపత్రి మెడికల్ సుపరిటెండెంట్ రోహిల్ కుమార్ అన్నారు. జిల్లా ప్రభుత్వ అసుపత్రిలో 6వ బ్యాచ్‌కు సోమవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న రోహిల్ కుమార్ మాట్లాడుతు గ్రామీణ ప్రజలకు సిహెచ్ఒలు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలందించాలనే ప్రభుత్వ ధ్యేయాన్ని నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు వన్నప్ప, శిక్షకులు అమర ప్రియ, శిక్షణకు హాజరైన సిహెచ్ఒలు పాల్గొన్నారు.

అర్జీలకు త్వరితగతిన పరిష్కారాలు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ప్రజల నుంచి 240 వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్, డిఆర్ఒ కొండయ్య, ఆర్‌డిఒ భాగ్యరేఖ, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఫిర్యాదుదారుల అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు బాధ్యతాయుతంగా విజయవంతం చేయాలన్నారు. గృహ నిర్మాణాల పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఒ విజయ్ కుమార్, గృహ నిర్మాణ శాఖ పీడీ చంద్రమౌళి రెడ్డి, పిఆర్ ఎస్ఇ గోపాల్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు. డిపిఒ విజయ్ కుమార్, డిఎంహెచ్ఒ కృష్ణారెడ్డి, ల్యాండ్స్ సర్వే ఎడి రామకృష్ణ, బిసి వెల్ఫేర్ డిడి నిర్మల జ్యోతి, సోషల్ వెల్ఫేర్ డిడి శివ రంగ ప్రసాద్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్



ఆందోళన చేస్తున్న నాయకులు

విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ పోరాటం

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగార్జున, బాబావలి మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించాలని ఖాళీగా ఉన్న లెక్చలర్ పోస్టులను భర్తీ చేయాలని పెండింగ్ లో ఉన్న నాడు నేడు పనులను త్వరగతిన పూర్తి చేసి పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జగనన్న విద్యా కానుక కిట్లను ప్రతి విద్యార్థికి అందించాలన్నారు. సాంఘిక సంక్షేమహాస్టళ్లలో విద్యార్థులకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలని బుక్కపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పక్కా భవనలు నిర్మించాలని జిల్లా కేంద్రంలోని పుట్టపర్తిలో ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబ్జాన్, సహాయ కార్యదర్శి పవన్, హర్ష కుమార్, దాము, నిరంజన్, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి కదిరి అర్బన్

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం పనిచేస్తోందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని నానా దర్గా సచివాలయం, 17 వ వార్డు పరిధిలోని టైటానిక్ వీధి, మసీదు వీధి, రామిరెడ్డి కాలనీల్లో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమామంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. వార్డులో గల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ లు, కౌన్సిలర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, కో ఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి రూరల్ : పీస్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా పేద విద్యార్థులకు వైద్య శాఖలో ఇచ్చే ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని డాక్టర్ బొగ్గు సురేష్ కోరారు. సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 17 సంవత్సరాల నుండి ఉచిత కంటి వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. వందలాదిమందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేశామని,పుట్టపర్తి కేంద్రంగా పుట్టపర్తి ఇన్స్టూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌బిటెక్నాలజీలో ఈ ఏడాది 30 మంది విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఆప్టోమెట్రిక్, ఆప్తాల్ మిక్, మెడికల్ ల్యాబ్ డిప్లొమాలో 30 మంది విద్యార్థులకు రెండు సంవత్సరాల ఉచిత శిక్షణ, ఆప్తమాలిక్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియ కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు వివరించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు కళాశాలలో గాని 9912276429 నెంబరులో గాని సంప్రదించాలని ఆయన కోరారు.

ఇళ్ల స్థలాల కోసం విలేకరుల వినతి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణం, రూరల్ మండల జర్నలిస్టులుగా విధులు నిర్వహిస్తున్న వారందరికి ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని హిందూపురం జర్నలిస్టులు సబ్‌కలెక్టర్ కార్తీక్‌నుకోరారు. సోమవారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమంలో ఈ విషయంపై వినతిని ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు సురేష్‌రెడ్డి, ఉపాధ్యక్షులు షబ్బీర్, రాజేష్ మాట్లాడుతు 2008 నుంచి ఇప్పటి వరకు జర్నలిస్టులకు ఇంటి స్థలాలను మంజూరు చేయలేదన్నారు. స్థల సమస్య ఉందని అని చెప్పడంతో స్థలాన్ని తామే గుర్తించి, దానికి సంబందించిన వివరాలను స్థానిక తహశీల్దార్ ద్వారా కలెక్టర్ కార్యాలయానికి అందజేశామన్నారు. ఇది జరిగి రెండు సంవత్సరాలు అవుతున్న సమస్య పరిష్కారం కాలేదన్నారు. విచారణ చేసి, అర్హులైన వారందరికి ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని కోరారు.

ధర్నాను విజయవంతం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30న విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తున్నామని ఈ ధర్నాకు రైతులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని రైతుసంంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న పిలుపు నిచ్చారు. ఈ మేరకు సిపిఎం స్థానిక కార్యాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహాధర్నాకు సంబంధించిన గోడపత్రికలను ఆయనతోపాటు ఏపీ చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలా రామాంజినేయులు, రైతుసంఘం మండల అధ్యక్షులు కొత్తపేట మారుతి తదితరులు విడుదల చేశారు. ఈ సందర్భంగా జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ గత ఏడాది నవంబరు, డిసెంబరు, ఈ ఏడాది ఏప్రిల్, మే నెలలో కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. గత ఏడాది ఖరీప్, రబీ సీజన్లలో పంటలు నష్టపోయిన రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ, పంటలబీమా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు కనీసం పెట్టుబడులకు కూడా చాలవని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ధరలపై అదనంగా 20శాతం బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే ప్రక్రియ, వ్యక్తులకు, వాణిజ్య సంస్థలకు ప్రవేశించడానికి ఇచ్చిన జీవో 254ను ఉపసంహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్‌హెచ్ బాషా, రేగాటిపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

హిందూపురం : స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని సబ్‌కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్తీక్ మున్సిపల్ కార్యలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 94 ఫిర్యాదులు అందాయి. ఈసందర్భంగా పలువురు పలు సమస్యలపై అర్జీలు సమర్పించారు.




అర్జీలు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సబ్ కలెక్టర్ కార్తీక్‌ను కోరారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప మాట్లాడుతు మున్సిపల్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. స్పందన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, తహశీల్దార్ హసీన సుల్తాన, ఇఒఆర్‌డి నటరాజ్, గృహ నిర్మాణ శాఖ డిఇఇ శివకుమార్ నాయక్, ఎంఇఒ గంగప్పతో పాటు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి - హిందూపురం

వైసిపి పాలనలో రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు లభించాయని ఎమ్మెల్సీ ఇక్బాల్ అన్నారు. సోమవారం పురపాలక సంఘ పరిధిలోని 18వ వార్డులో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజతో కలిసి ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, వార్డు ఇన్‌చార్జ్ కవిత, కౌన్సిలర్లు అయూబ్, మల్లికార్జున, నాగేంద్ర బాబు, వాణిజ్య విభాగం అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్, కన్వీనర్ నౌషాద్ ఖాన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ

జిల్లా కేంద్రం ఉద్యోగులకు 16 శాతం హెచ్ఆర్ ఇవ్వాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లా కేంద్రమైన పుట్టపర్తి లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులందరికీ 16 శాతం ఇంటి బాడుగ ఇవ్వాలని ఉద్యోగ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబుకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు మాత్రమే 16 శాతం ఇంటి అద్దె చెల్లిస్తున్నారన్నారు. కొత్త జిల్లాలో పనిచేస్తున్న ఇతర ఉద్యోగులకు కూడా 16 శాతం ఇంటి అద్దె చెల్లించాలని ప్రభుత్వం జీవో విడుదల చేసినప్పటికీ ఇతర ఉద్యోగులకు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పడిన పార్వతీపురం, పాడేరు, అమలాపురం, భీమవరం, బాపట్ల, నరసరావుపేట, రాయచోటి తదితర కొత్త జిల్లాలలో అన్ని శాఖల ఉద్యోగులకు 16 శాతం చెల్లిస్తున్నారని ఆదే విధంగా సత్యసాయి జిల్లాలో కూడా వర్తింప చేయాలని కలెక్టర్‌ను కోరామన్నారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి తాలూకా ఎన్‌జిఒ అధ్యక్షులు లింగా రామ్మోహన్, ఆర్‌టిసి రీజినల్ కార్యదర్శి షబ్బీర్, సంయుక్త కార్యదర్శి శ్రీరామ్ నాయక్, నాయకులు చంద్రాయుడు, గోపి, రామాంజనమ్మ, పరిమళ, రాయుడు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

పార్టీ పునర్ నిర్మాణానికి పనిచేయండి

ఎపి పిసిసి అధ్యక్షులు



సమావేశంలో మాట్లాడుతున్న రుద్రరాజు

ప్రజాశక్తి - పరిగి

కాంగ్రెస్ పార్టీ పునర్నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎపిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రంరాజు పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం పరిగి మండలం సేవమందిర్‌లోని కేటీ శ్రీధర్ నివాసంలో నియోజకవర్గస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న గిడుగు రుద్రంరాజు మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గానికి ఒక సమన్వయ కమిటీని ఏర్పాటు చేసి వారిద్వారా మండల, గ్రామీణ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఈ కమిటీలలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు 50 శాతం పోస్టులు కేటాయించినట్లు వెల్లడించారు. పార్టీ ద్వారా కేటాయించే పోస్టులు 50 శాతం యువతకే ఇవ్వనున్నట్లు చెప్పారు. నాయకులు మాస్ కాంటాక్ట్ పోగ్రాంకు శ్రీకారం చుట్టాలని ఈ కార్యక్రమం ద్వారా ఎన్జీవోలు, సంక్షేమ సంఘాల సభ్యులతో చర్చించి వారిని పార్టీలోకి తీసుకురావాలని కోరారు. పార్టీని వీడి ఇతర పార్టీలో చేరిన వారి గుర్తించి రాబోయే రోజుల్లో పార్టీ తీసుకొస్తున్న కార్యక్రమాలను సంక్షేమ పథకాలను తెలియజేసే మళ్లీ పార్టీలోకి తీసుకురావాలని కోరారు. నాయకులు ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పనిచేయాలని కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాలను కలుపుకొని ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఇటీవలే కాశీ నుండి కన్యాకుమారి వరకు రాహుల్ గాంధీ తలపెట్టిన జూడో యాత్ర విజయవంతమై కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావడానికి బాగా పనిచేస్తుందని అన్నారు. ఈ పాదయాత్ర ఒక చరిత్ర అని ఆయన అన్నారు. అనంతరం పార్టీ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు తీసుకుని ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఎపిసిసి సెక్రటరీ మయ్యాప్పన్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, కోఆర్డినేటర్ సభ్యులు శ్రీరామమూర్తి, జిల్లా అధ్యక్షులు సుధాకర్, ఎపిసిసి మెంబర్ కెటి శ్రీధర్, ఎస్సీ సెల్ అధ్యక్షులు సాకేశంకర్, ఎన్ఎస్‌యుఐ నాగమధు, యూత్ కాంగ్రెస్ రామారావు, కోటా సత్యం తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వివాహిత ఆత్మహత్య

కొత్తచెరువు : కొత్త చెరువుకు చెందిన వివాహిత ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు.. సుమన (21) అనే మహిళ ఆమె భర్తతో కలిసి కొత్తచెరువుకు వలస వచ్చి అద్దె ఇల్లు తీసుకొని నివాసం ఉంది. ఈ నేపథ్యంలో సుమన తమ గ్రామానికి వెళ్లివస్తానని భర్తను కోరింది. ప్రస్తుతం తమ వద్ద డబ్బులు లేవని ఏవైనా పనులు చేసుకుని డబ్బులు వచ్చిన తర్వాత ఊరికి పంపిస్తానని చెప్పారు. ఊరికి పంపలేదని మనస్థాపం చెందిన సుమన ఆదివారం రాత్రి ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు.

పురుగులమందు తాగిన బాలుడు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని మార్కెట్ యార్డ్ వద్ద నివాసమున్న నాగేశ్, రాజేశ్వరి దంపతులు కుమారుడు మూడు సంవత్సరాల జోనాథన్ అనే బాలుడు తెలియక పురుగులమందు తాగి అపరస్మారకస్థితిలోకి చేరాడు. తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు.. జానోథన్ ఇంటి ముందు గల చెట్ల పొదల్లో ఉన్న పురుగుల మందు డబ్బాను ఆడుకునేం దుకు తీసుకున్నాడు. ఈ క్రమంలో డబ్బాలో ఉన్న మందును తాగాడు. దీంతో ఆ బాలుడు ఆపరస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించిన తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు.

విలేకరిపై దాడి

బుక్కపట్నం : మండలంలో ఓ ఛానల్‌కు పనిచేస్తున్న విలేకరి నరసింహమూర్తిపై దాడి జరిగింది. సోమవారం ఉదయం కష్టాపురం నుంచి గూనిపల్లికి వస్తుండగా బాలే నాయక్‌తండా సమీపంలో మారాల గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ రామ మోహన్ తనను అడ్డగించి దాడి గాయపరిచినట్లు బాధిత విలేకరి నరసింహమూర్తి తెలిపారు తనపై దాడికి దిగిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

బార్‌లో అగ్నిప్రమాదం

కదిరి అర్బన్ : పట్టణంలోని బస్టాండ్ సమీపాన ఉన్న ఎస్ఎల్‌వి బార్ అండ్ రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. వెంటనే స్పందించిన రెస్టారెంట్ యజమాని వెంకటేష్ ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చేలోపే 20 లక్షల రూపాయల విలువైన మద్యం, సామాగ్రి తదితరవస్తువులు కాలి బూడిద అయినట్లు వెంకటేష్ తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సుంది.

కర్నాటక మద్యం స్వాధీనం

గోరట్ల రూరల్: కర్నాటక ప్రాంతం నుంచి గోరంట్లకు అక్రమంగా మద్యం తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను సోమవారం గోరంట్ల పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సిఐ సుబ్బరాయుడు తెలిపారు. మండల పరిధిలోని కమ్మలవాండ్లపల్లి గ్రామ శివారులో దిగువ గంగంపల్లి గ్రామానికి చెందిన ఎం.శ్రీనివాసులు, ఎగువ గంగంపల్లి గ్రామానికి చెందిన డి.నబీరసూల్‌ను అదుపులోకి తీసుకొని వారి నుంచి మద్యం బాటిల్స్, టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే చింతమానుపల్లి గ్రామ సమీపంలో చుండూరువాండ్లపల్లి గ్రామానికి చెందిన వడ్డే శ్రీరాములు ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని, బైక్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు.

నాణ్యమైన విత్తన వేరుశనగ ఇవ్వాలి : ఎపి రైతుసంఘం

ముదిగుబ్బ : రైతులకు నాణ్యమైన సబ్సిడీ విత్తన వేరుశనగను ఇవ్వాలని ఎపి రైతుసంఘం నాయకులు జంగాలపల్లి పెద్దన్న డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో ఎఒ నరసింహులుకు అందజేశారు. ఈసందర్భంగా పెద్దన్న మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయాలని అకాల వర్షం ద్వారా నష్టపోయిన రైతులకు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఆటో పెద్దన్న, రైతు సంఘం నాయకులు మల్లికార్జున, జయప్ప, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలంకు పత్యేక బస్సు సర్వీసులు

కదిరి టౌన్ : జూలై 3న పౌర్ణమి సందర్భంగా అరుణాచలం గిరిప్రదక్షిణ కొరకు కదిరి నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు కదిరి ఆర్టీసీ డిపో మేనేజరు బి.మైనోద్దీన్ తెలిపారు. ఆల్ లైన్ నెంబరు: 9052537054 ద్వారా కూడ టిక్కెట్టును బుక్ చేసుకోవచ్చునని డిపో మేనేజరు తెలిపారు. ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ మేనేజర్లు హరిత, హరిమోహన్ కోరారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

ఓబుల దేవర చెరువు : మండలంలోని నల్లగుట్లపల్లిలో విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన రైతు కటుంబాన్ని ఆదుకోవాలని సిపిఐ పుట్టపర్తి నియోజకవర్గం కార్యదర్శి ఆంజనేయులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జెవి రమణ కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చలపతి, వెంకటరమణ రైతు సంఘం నాయకులు చౌడప్ప ,ఇక్బాల్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థికసాయం

హిందూపురం : పట్టణంలోని హస్నాబాద్‌లో నివాసం ఉంటున్న ఎమ్.డి.యూసుఫ్ భార్య క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. ఆమె వైద్య ఖర్చులకు డబ్బులు లేక ఆర్థికంగా ఇబ్బందికి గురవుతున్న విషయాన్ని వైసిపి నాయకుల ద్వారా ఆగ్రోస్ చైర్మేన్ నవీన్ నిశ్చల్ తెలుసుకున్నారు. ఈ మేరకు బాధితులకు సోమవారం రూ.20వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

ఇసుక సమస్యను పరిష్కరించండి

హిందూపురం : పట్టణంలో ఇసుక లభ్యం కాకపోవడంతో అభివృద్ధి పనులు వేగ వంతంగా జరగడం లేదని, సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ కార్తీక్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ కోరారు. సోమవారం స్పందన కార్యక్రమానికి వచ్చిన సబ్‌కలెక్టర్ దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో మెరిసిన 'పురం' విద్యార్థులు

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లా నుండి జిల్లా స్థాయి పోటీలలో ఎంపికై చిత్తూరు జిల్లా పుత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొన్న పురం విద్యార్థులు జూలైలో కేరళలో జరిగే సౌత్ జోన్ పెంకాక్ సిలాట్ పోటీలకు ఎంపిక అయ్యారు. ఉమ్మడి జిల్లాల నుండి పదిమంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా ఎనిమిది మంది బంగారు పతకాలను, ఇద్దరు వెండిపతకాలను కైవసం చేసుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సౌత్ జోన్ సెక్రెటరీ మనోజ్‌సాయి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సిలాట్ సెక్రటరీ భరద్వాజ్ రెడ్డి, ప్రెసిడెంట్ భాస్కర్ అభినందించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులు చంద్ర కిషోర్ రెడ్డి, సాయి రేవంత్, చాను శ్రీ, దివ్య, మానస, జైనీల్ రెడ్డి, ఈశ్వర్, తనీశ్వర్ రెడ్డి, తన్విత రెడ్డి, గుణ సాయి వర్ధన్ రెడ్డికి ప్రశంసా పత్రాలను అందజేశారు.

'అమ్మఒడి' చారిత్రాత్మకం : ఎమ్మెల్యే

ధర్మవరం టౌన్ : అమ్మ ఒడి పథకం చరిత్రాత్మకమని ఇది పేదల జీవితాలలో వెలుగులు నింపుతోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం అమ్మ ఒడి లబ్దిదారులతో కలసి భారీ ర్యాలీ చేపట్టారు. ఈనెల 28న అమ్మ ఒడి నిధుల విడుదల సందర్భంగా జగనన్నకు మద్దతుగా ఈర్యాలీని నిర్వహించారు. అనంతరం కళాశాల సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరక్ష్యరాస్యతను రూపు మాపేందుకు అమ్మ ఒడి పథకం ఉపయోగపడుతోందని అన్నారు. ఇప్పటి దాకా ఒక్క ధర్మవరం నియోజకవర్గంలో మాత్రమే పిల్లల్ని బడులకు పంపే తల్లుల ఖాతాలో రూ.162కోట్ల నిధులను జమ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్లు ఎర్రగుంట భాగ్యలక్ష్మి, పెణుజూరు నాగరాజు, తాడిమర్రి ఎంపీపీ పాటిల్ భువనేశ్వరరెడ్డి, బత్తలపల్లి మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ



ధర్మవరంలో నిర్వహిస్తున్న ర్యాలీ



తనకల్లులో మానవహారం ఏర్పాటు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

కొత్తచెరువు : యువత మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను పాడు చేసుకోవద్దని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. అంతర్జాతీయ మారకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం కొత్తచెరువు నాలుగు రోడ్ల కూడలిలో వైద్య సిబ్బంది మహిళా పోలీసులు కళాశాల, పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు బానిస కాకూడదన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారికి సమాజంలో విలువ ఉండదన్నారు. డ్రగ్స్ రహిత నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కషి చేయాలన్నారు. టోల్ ఫ్రీ నెంబర్14500 తమకు సమాచారం అందజేస్తే ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారుజ ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రవికుమార్, డీఎస్పీ వాసుదేవన్, సిఐలు రాగిరి రామయ్య, బాలసుబ్రమణ్యం రెడ్డి, రాజేందర్ నాథ్ యాదవ్, సెర్ప్ సిఐ మాధవి, ఎస్ఐలు లింగన్న, నరసింహుడు, దాదాపీర్, వెంకటనారాయణ, డాక్టర్ సునీల్, ఎంపీహెచ్వో కంబగిరి స్వామి, సిహెచ్ఓ గౌరీదేవి, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : మాదకద్రవ్యాల వల్ల బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, సెబ్ సిఐ లక్ష్మీ దుర్గయ్య యువతకు సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలో విద్యార్థులు, మహిళా పోలీసులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలైన గంజాయి, నల్లమందు, బ్రౌన్ షుగర్ తదితర వాటిని తయారుచేయడం, నిల్వఉంచడం, విక్రయించడం, రవాణా చేయడం లాంటివి చట్టరీత్యా నేరమన్నారు. ఈ క ఆర్యక్రమంలో వన్టౌన్, టూటౌన్ సిఐలు సుబ్రమణ్యం, రాజ, సెబ్ ఎస్ఐ సుశీలమ్మ, హెడ్కానిస్టేబుళ్లరమేశ్, భాస్కర్, కానిస్టేబుళ్లు కిరణ్, గిరీష్ కుమార్, మల్లికార్జున, రామలింగ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్ లో దళిత చైతన్య సమితి నాయకుడు బాలాజీ అధ్వర్యంలో రూరల్ సీఐ సూర్యనారాయణ, ఎస్ఐ బాబ్జాన్ చేతుల మీదుగా ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ సందర్భంగా గోడ పత్రికలు విడుదల చేసారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వారిని అభినందిస్తూ ఇలాంటి కార్యక్రమాలు కళాశాలలో నిర్వహించి విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా చైతన్యం తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు యదల్లా రాజేష్, గాలివీడు ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో సోమవారం ఎస్ఐ రాంభూపాల్ యాదవ్ ఆధ్వర్యంలో జూనియర్ కాలేజీ విద్యార్థులు ర్యాలీ మానవహారం నిర్వహించారు.

గాండ్లపెంట : అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి. ఆధ్వర్యంలో. సోమవారం. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో. ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్ అలీ, జయరాములు, పోలీసులు రామయ్య, శ్రీనివాసులు, భాస్కర్ రాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : మత్తు పదార్థాల జోలికి జీవితంలో ఎప్పుడూ వెళ్ళమని విద్యార్థుల చేత డీఎస్పీ శ్రీలత ప్రతిజ్ఞ చేయించారు. ఈ నేపథ్యంలోనే విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు, ఆయా శాఖ సిబ్బందితో ర్యాలీ నిర్వహించి మానవహారాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు : మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, కాలేజీ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ స్కూల్ కరస్పాండెంట్ ఫక్రుద్దీన్, సచివాలయ మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

కదిరి : అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్ టి ఎస్ ఎన్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో మండల న్యాయ సేవ అధికార సంస్థ వారి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు .ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ ప్రతిమ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సుందరి హాజరయ్యారు. మాదకద్రవ్యాల వల్ల వచ్చే ఇబ్బందులు, మాదకద్రవ్యాల చట్టం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లింగాల లోకేష్ రెడ్డి, న్యాయవాది నరసింహులు, ఎస్టిఎస్ఎన్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

హిందూపురం : యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని స్థానిక అదనపు మెజిస్ట్రేట్ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక సప్తగిరి కళాశాలలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను వమ్ము చేయకుండా మంచి వారితో స్నేహ సంబంధాలను పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నారాయణరెడ్డి, ఎఓ గంగిరెడ్డి, న్యాయవాదులు నాగప్ప, నవేరా, లోక్ అదాలత్ శారద, లైజనింగ్ అధికారి శ్రీనివాసులు, ఎస్ఐ భాస్కర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : ఆడపిల్లలను అక్రమ రవాణ చేయడం నేరమని సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి పేర్కొన్నారు. స్థానిక మోడల్ స్కూల్లో సోమవారం న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి మాట్లాడుతూ ఆడపిల్లలను అక్రమ రవాణ చేయడం చట్ట రీత్యా నేరమన్నారు. అదేవిధంగా బాలకార్మికులను నివారించడానికి అందరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి రమ్యసాయి, న్యాయవాదులు బాలసుందరి, దస్తగిరిసాబ్, రవి, మోహన్ ప్రసాద్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : ఆంధ్రప్రదేశ్ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మారుద్దామని సీనియర్ సివిల్ జడ్జి ఎం.శంకరరావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియ ర్ కళాశాలలో జడ్జి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి డ్రగ్స్, మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎజిపి ఎం.భాస్కర్ రెడ్డి, న్యాయవాదుల సం ఘం అధ్యక్షుడు డి.నాగరాజు, ప్రిన్సిపల్ బషీర్ అహ్మద్, న్యాయవాది నాగిరెడ్డి, కోర్టు సిబ్బంది, కళాశాల అధ్యాపకు లు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి విద్యార్థులు చేపట్టిన అవగాహన ర్యాలీని పెనుకొండ డిఎస్పి హుస్సేన్పీరా జెండా ఊపి ప్రారంభించారు. పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి దర్గా సర్కిల్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సిఐ కరుణాకర్, సెబ్ సిఐ సుబ్బా రెడ్డి, ఎస్ఐ రమేష్బాబు, కియా ఎస్ఐ వెంకటరమణ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, జనజాగృతి సిబ్బంది, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గాండ్లపెంటలో నిర్వహిస్తున్న ర్యాలీ

గోరంట్ల : మత్తు పదార్థాలను విడనాడి విలువైన జీవితాన్ని కొనసాగించాలని సిఐ సుబ్బరాయుడు యువతకు సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలో సిఐ డ్రగ్స్ దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ బాబు, ఎస్పివిఎం, షిరిడీ సాయి కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు పోలీసులు పాల్గొన్నారు

మడకశిర : పోలీసు, సెబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంపై పట్టణంలో చేపట్టిన ర్యాలీని సిఐ సురేష్బాబు, సెబ్ సిఐ భార్గవ్రెడ్డి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకూ సాగింది. అనంతరం రాజీవ్ గాంధీ సర్కిల్లో మానవ హారంగా ఏర్పడి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలంటూ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. అలాగే మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ర్యాలీలో ప్రభుత్వ జూనియర్, ఒకేషనల్ జూనియర్ కళాశాలలు, ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ ఇషాక్బాషా,సెబ్ ఎస్ఐ ఫరూక్ అజాం, ఏఎస్ఐ కృష్ణారెడ్డి, సెబ్ హెడ్ కానిస్టేబుళ్లుజనార్ధన్, సాల్మన్రాజ్, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.



ఒడిసిలో నిర్వహిస్తున్న ర్యాలీ

సోమందేపల్లి : స్థానిక ఎన్టీఆర్ సర్కిల్లో ఎస్ఐ విజయ్కుమార్, జడ్పిటిసి డిసి అశోక్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు వేణుగోపాల్ ఆధ్వర్యంలో 'అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం'పై అవగాహన కల్పించారు. అలాగే ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో గ్రామ వీధుల్లో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మురళి, పోలీస్ సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లేపాక్షి: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా లేపాక్షి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్ఐ షర్ఫుద్దీన్ మాట్లాడుతూ యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి పోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని విద్యార్థులు నినాదాలు చేశారు. ర్యాలీలో పోలీసులు షెక్షావలి, చెన్నకేశవులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పెనుకొండలో మానవహారం ఏర్పాటు



సోమందేపల్లిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



మడకశిరలో అవగాహన ర్యాలీ